సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 12 । అక్టోబర్ । 2024



అటవీ చట్టాలపై ప్రజలకు అవగాహన

సిద్దవటం: ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, జ్యోతి గ్రామాల్లోని ప్రజలకు శుక్రవారం అటవీ చట్టాలపై అవగాహన కల్పించామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు.

రేపు దూదేకుల ఆత్మీయ సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా దూదేకుల ప్రముఖులతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నూర్‌బాష దూదేకుల ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల సిద్దయ్య పేర్కొన్నారు. ఆదివారం ప్రొద్దుటూరు గౌతమి ఇంజినీరింగ్ కళాశాలలో సమ్మేళనం ఉంటుందని తెలిపారు.

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.520	రూ.600
రెండోరకం	రూ.380	రూ.500

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 98 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

రాయచోటి (జగదాంబసెంటర్): దుర్గామాత మహిషాసురుని సంహరించి... చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దసరా పండుగ జిల్లా ప్రజలందరికీ ఆయురారోగ్యాలను కలుగజేయాలని, జిల్లా సమగ్రాభివృద్ధి సాధించాలని వారు ఆ ప్రకటనలో ఆకాంక్షించారు.

15న తలనీలాల వేలం పాట

సిద్దవటం: మండలంలోని శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవంలో భక్తులు సమర్పించుకునే తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు సిద్దవటం లోని రంగనాయక స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయం ఈఓ మోహన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటదారుడు తలనీలాలకు దరావత్తు కింద రూ. 1 లక్ష చెల్లించాలన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుని దరావత్తు తప్ప మిగిలిన వారి దరావత్తు రుసుము వెనక్కు ఇస్తామన్నారు.

విజయీభవ

- నేడు విజయదశమి
- శమీ వృక్ష దర్శనానికి ఏర్పాట్లు
- అమ్మవారి ఆలయాలు, ఇళ్లలో ఆయుధపూజ

కడప కల్చరల్: పది రోజుల శరన్నవరాత్రి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి. మనలోని చెడును ప్రక్షాళన చేసుకునేందుకు పెద్దలు ఈ పండుగ ద్వారా ఓ మంచి అవకాశం కల్పిస్తున్నారు. మంచివారే కాదు దుష్టులు కూడా ఆ అమ్మకు బిడ్డలే. అయినా మేం మారం అంటూ మొండికేసే దుష్టశక్తులను కరుణామయమైన ఆ అమ్మచూపులే కత్తులై తునుమాడతాయి. మంచి వారికి నిత్యం విజయాలు అందిస్తాయి. ఇకనైనా మంచిగా మారకపోతే కఠిన దండన తప్పదంటూ ఈ పండుగ హెచ్చరిస్తోంది. మంచి వారికి అడగకపోయినా విజయాలు అందిస్తోంది. కష్టాలు వస్తే కుంగిపోకూడదని, మంచికోసం, మాట కోసం రాజరికాన్ని వదులుకొని పాండవులు అడవుల్లో కష్టాలు అనుభవించినా.. వారి మంచిని గమనించిన అమ్మ పాండవ మధ్యముడైన అర్జునుడిని విజయుడిని చేసింది. అందుకే మనమూ మంచిగా ఉందాం. రోజూ విజయాలను అందుకుందాం.

ఆయుధ పూజ

నవరాత్రి ఉత్సవాలలో చివరిరోజైన విజయదశమి ఎంతో విశిష్టతమైంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగ నిర్వహిస్తారు. అందులోని సామాజిక, నైతిక విషయాలను అటుంచితే.. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు విజయం సాధించిన రోజని, రాముడు రావణాసురుడిని మట్టుబెట్టిన రోజని, భగీరథుడు గంగను దివి నుంచి భువికి దించిన రోజు అని పురాణాల్లో ఉండటంతో ఈ రోజుకు ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలు, వ్యాపార సంస్థలు, ఇళ్లలోనూ ఆయుధపూజ నిర్వహిస్తారు. వాహనాలు శుభ్రం చేసుకుంటారు. కర్మాగారాల్లో తమ ఉపాధికి కారణమైన యంత్రాలను శుభ్ర పరుస్తారు. రైతులు వ్యవసాయ పనిముట్లను శుభ్రపరిచి పసుపు, కుంకుమలు అలంకరించి పూజలు నిర్వహిస్తారు.

విజయసాధన

జమ్మిచెట్టును వైదిక భాషలో అరణి అంటారు. యజ్ఞయాగాదులు (హోమాల్లో) సహజ పద్ధతులలో అగ్నిని పుట్టించేందుకు ఈ కొయ్యనే ఉపయోగిస్తారు. పాండవులు విరాటుని కొలువులో ఉంటూ శమీ వృక్షంపై తమ ఆయుధాలను దాచారని, ఉత్తర గోగ్రహణం సమయంలోనే విజయదశమి రావడం, అజ్ఞాతవాసం గడువు ముగియడంతో జమ్మి చెట్టుపై ఉంచిన ఆయుధాలను తీసుకుని యుద్ధం చేసి గెలిచారని మహాభారత కథనం. అందుకే శమీ దర్శనంతో తప్పక విజయం లభిస్తుందని విశ్వసిస్తారు.

శమీ దర్శనం

ఈ పండుగ ముగింపు సందర్భంగా శమీ వృక్ష దర్శనం జరుగుతుంది. ప్రతి ఆలయంలోనూ సాయంత్రం 3 గంటల అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకమైన రథాలు, పల్లకీలలో కొలువుదీర్చి అట్టహాసంగా సమీపంలోని శమీ వృక్షం వద్దకు తీసుకు వెళతారు. శమీ వృక్ష (జమ్మి చెట్టు) దర్శనం కూడా విజయదశమి నాటి ముఖ్య సంప్రదాయం. ఆరోజు సాయంత్రం ప్రజలు మంగళ వాయిద్యాలతో ఊరికి వెలుపల ఈశాన్యంలో ఉన్న శమీ వృక్షం వద్దకు వెళ్లి.. వాస్తు, దిక్పాలక, శమీ పత్ర పూజలు చేస్తారు. అనంతరం వేద పండితులు 'శమీ శమయతె పాపం.. శమీ శతృ వినాశనం..' అంటూ శ్లోక పఠనం చేస్తుండగా, మిగతా వారు ఉచ్చరిస్తూ శమీ వృక్షం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేస్తారు. బంగారంలా విలువైనదిగా భావించి జమ్మి ఆకును (బంగారం) అంటూ ఇచ్చి పుచ్చుకుంటారు. జమ్మి చెట్టు గుడి ఆవరణలో ఉంటే ఆ ఆకును ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు ఇచ్చి పాదాభివందనం చేస్తారు. ఆరోజున వీలుకాకుంటే మరుసటిరోజు లేదా ఆ మరునాడు బంధుమిత్రులకు కూడా జమ్మి ఆకు ఇచ్చి శుభాభివందనాలు తెలుపుతారు.



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో గాయత్రిమాతగా దర్శనమిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి

శక్తి స్వరూపిణి అయిన జగజ్జనని.. ఈ జగమంతా అనేక రూపాల్లో కొలువై ఉన్నారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల వేళ.. కొన్ని అవతారాల్లో దర్శనమిచ్చి అభయమిచ్చారు. ఈ వేడుకలు తొమ్మిది రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి.. గాయత్రిమాతగా కటాక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని కనులారా దర్శించుకుని తరించారు.

– ప్రొద్దుటూరు కల్చరల్

కాచిగూడ-మంగళూరు రైలు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప జిల్లా మీదుగా కాచిగూడ-మంగళూరు-కాచిగూడ మధ్య నడిచే వారాంతపు రైలు (12789/90)ను ముర్డేశ్వర్ వరకు పొడిగించగా, ఈ రైలు శుక్రవారం నుంచి నడుస్తుందని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలుకు కడప, ఎర్రగుంట్లలో స్టాపింగ్ కల్పించారని ఆయన పేర్కొన్నారు.

ఫోర్‌లైన్ ట్రాక్‌కు సన్నాహాలు

- గుంతకల్-రేణిగుంట మార్గంలో నిర్మాణదిశగా రైల్వేశాఖ అడుగులు
- మొదటి విడతగా 56 కి.మీ మేర పనులు
- రేణిగుంట-ఓబులవారిపల్లె జంక్షన్ వరకు
- రెండవ విడతలో 256 కి.మీ మేర పనులు
- ఓబులవారిపల్లె-గుంతకల్లు రైలుమార్గం నిర్మితం
- 3, 4 లైన్ నిర్మాణానికి సర్వే
- కసరత్తు చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే



ముంబయి-చెన్నై కారిడార్ రైలు మార్గంలోని గుంతకల్-రేణిగుంట డబుల్‌లైను మార్గం

రాజంపేట: ముంబయి-చెన్నై కారిడార్ రైలు మార్గంలోని రేణిగుంట-గుంతకల్లు (ఉభయ వైఎస్సార్ జిల్లా మీదుగా) వెళుతున్న డబుల్ లైనుకు అనుగుణంగా 3, 4 లైన్లను నిర్మితం చేయనున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన జోనల్ రైల్వే మీటింగ్‌లో రైల్ డెవలప్‌మెంట్ వర్క్ పేరిట విడుదలైన బ్రోచర్ ద్వారా ఈ విషయం ఎంపీలకు తెలియచేశారు. ఇందుకు తగ్గట్టుగా రైల్వే శాఖ అధికారులు నివేదికలను తయారు చేసుకుంటున్నారు. 3, 4లైను నిర్మితానికి సంబంధించి అవసరమైతే భూసేకరణ, లేకుంటే రైల్వే స్థలం అవసరమవుతుందా అని సర్వే చేయించుకుంటున్నారు. ఇప్పటికే రైలు మార్గం వెంబడి రైల్వే సరిహద్దులను గుర్తించారు. ఒక్క నందలూరు రైల్వే కేంద్రంలో మినహా అన్ని స్టేషన్‌లలో అదనంగా 3, 4కు సంబంధించి లైన్లు వేయాల్సి ఉంటుంది.

మొదటి విడతగా.. రేణిగుంట-ఓబులవారిపల్లె..

జిల్లా మీదుగా వెళ్లే రైలుమార్గం (డబ్లింగ్)లో రేణిగుంట-ఓబులవారిపల్లె (56 కిలోమీటర్ల దూరం) మధ్య మూడవ, నాల్గవ లైను నిర్మించనున్నారు. రేణిగుంట నుంచి అటవీప్రాంతం మామండూరు, బాలపల్లె, శెట్టిగుంట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె వరకు మూడవ, నాల్గవ లైను నిర్మితం చేయాలనుకుంటున్నారు.

రెండవ విడతలో ఓబులవారిపల్లె-గుంతకల్

రెండ విడతలో ఓబులవారిపల్లె-గుంతకల్ మధ్య మూడవ, నాల్గవ లైను నిర్మితం కానున్నది. 256 కిలోమీటర్ల మేర ఈ మార్గం ఉంది. ఇప్పటికే ఈ మార్గం డబ్లింగ్ చేశారు. రాజంపేట, నందలూరు, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్ స్టేషన్ల మీదుగా ఈ మార్గంలో మూడవ, నాల్గవ లైను నిర్మితం చేయనున్నారు.

3, 4 లైన్లకు సంబంధించి సర్వేను కూడా..

3, 4 లైన్లకు సంబంధించి అంతర్గత సర్వేను కూడా రైల్వేశాఖ చేయించుకున్నట్లు రైల్వే వర్గాలు అంటున్నాయి. అయితే గుంతకల్-రేణిగుంట మధ్య 3, 4 లైన్ల నిర్మాణంకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక రైల్వేబోర్డుకు చేరిన తర్వాత బడ్జెట్‌లో ప్రవేశపెడుతుంది. ఆ తర్వాత ఈ మార్గంలో 3, 4 లైన్‌కు నిధుల వ్యయం ఎంతనేది బహిర్గతమవుతుంది.

గూడ్స్ రైళ్లు వెళ్లేందుకు..

3, 4 లైన్లు నిర్మితం చేయడం వల్ల ఈ మార్గంలో నిరంతరం గూడ్స్ రైళ్లు వెళ్లేందుకు దోహద పడనున్నది. సిమెంట్, బొగ్గు, ఐరన్‌తోపాటు ఇతర సరుకుల రవాణా అధికంగా ఉంటుంది. చెన్నై, ముంబయి, కృష్ణపట్నం పోర్టుతో పాటు ఉత్తరభారతదేశంలోని ప్రధాన ప్రాంతాలకు సరుకుల రవాణ చేసే గూడ్స్ రైళ్ల రద్దీ ఈ మార్గంలో అధికంగా ఉంటుంది. 3, 4 లైన్లు ఏర్పాటు చేయడం వల్ల గూడ్స్ రైళ్ల ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. ఇటు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏ మాత్రం అంతరాయం లేకుండా ఈ పనులు కొనసాగించాలని దక్షిణ మధ్య రైల్వే కసరత్తు చేస్తోంది. ఆ దిశగా డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు తయారీలో రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు.

ఫోర్‌లైన్ ట్రాక్ అవసరం




భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గుంతకల్-రేణిగుంట మధ్య ఫోర్‌లైను ట్రాక్స్ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. ఉభయ వైఎస్సార్ జిల్లా మీదుగా వెళ్లే ముంబయి-చెన్నై రైలుమార్గం ప్రధానమైనది. గూడ్స్ రైళ్ల ట్రాఫిక్ అధికంగా ఉంది. దానికి తోడు ఎక్స్‌ప్రెస్‌రైళ్లు అధికంగా ఉన్నాయి. అందువల్ల రేణిగుంట-ఓబులవారిపల్లె-గుంతకల్ మధ్య 3, 4 లైన్ తీసుకురావడం వల్ల గూడ్స్ ట్రాఫిక్‌తో పాటు ప్యాసింజర్ రైళ్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదు. ద.మ రైల్వే ఈ లైన్ల ఏర్పాటులో వేగవంతంగా చర్యలు తీసు కోవాలి.

– పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

మద్యం షాపుల

టెండర్లు పూర్తి

- 111 షాపులకు 2,111 దరఖాస్తులు
- రూ.42.22 కోట్ల ఆదాయం



రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలోని ప్రభుత్వ మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ పూర్తయింది. శుక్రవారం చివరి తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 111 మద్యం షాపులకు 2,111 దరఖాస్తులు దాఖలు అయినట్లు జిల్లా ఎక్సైజ్ ఎస్‌ఈ మధుసూదన రావు తెలిపారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ. 42.22 కోట్ల ఆదాయం చేకూరిందన్నారు.

నియోజకవర్గాల వారిగా....

రాయచోటిలో 16 షాపులకు 422 దరఖాస్తులు, లక్కిరెడ్డిపల్లిలో 7 షాపులకు 150 దరఖాస్తులు, రాజంపేటలో 20 షాపులకు 253 దరఖాస్తులు, కోడూరులో 19 షాపులకు 224 దరఖాస్తులు, మదనపల్లిలో 22 షాపులకు 649 దరఖాస్తులు, ములకలచెరువులో 9 షాపులకు 199 దరఖాస్తులు, వాయిల్పాడులో 9 షాపులకు 78 దరఖాస్తులు, పీలేరులో 9 షాపులకు 136 దరఖాస్తులు వచ్చాయి. అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి మార్గంలోని అజయ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 14వ తేదీన లక్కీడ్రా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీయనున్నారు. అదేరోజున షాపుల కేటాయింపు కూడా జరుగుతుందని జిల్లా అధికారి తెలిపారు.

పాడి రైతులకు దసరా బోనస్

రూ.3 కోట్లు చెల్లింపు

- వరుసగా నాలుగో ఏడాది చెల్లించిన అమూల్ డెయిరీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మదనపల్లె : దసరా, దీపావళి సందర్భంగా అమూల్ డెయిరీకి పాలుపోసిన పాడి రైతులకు బోనస్ రూ.3 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు అమూల్ యాజమాన్యం తెలిపింది. శుక్రవారం అమూల్ డెయిరీ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పాలవెల్లువ పథకంలో భాగంగా వరుసగా నాలుగోసారి పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెల్లించినట్లు పేర్కొంది.

- ప్రతి ఏడాది దసరా, దీపావళి పండుగను పురస్కరించుకుని (అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు) ఏడాదిలో కనీసం 183 రోజులు డెయిరీకి పాలుపోసిన రైతులకు లీటర్‌కు అర్ధరూపాయి బోనస్‌ను వారి ఖాతాల్లో జమచేశామన్నారు. 2021లో 3,610 మందికి రూ.25.59 లక్షలు, 2022లో 6,880 మందికి రూ.70.77 లక్షలు, 2023లో 10,455 మంది పాడిరైతులకు రూ.1.27 కోట్లు చెల్లించామని, ప్రస్తుతం 2024 సంవత్సరానికి 18,645 మంది రైతులకు రూ.2.86 కోట్ల బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు.
- జిల్లాలవారీగా తీసుకుంటే.. అన్నమయ్య జిల్లాలో 380 గ్రామాల్లో 5,884 పాడిరైతులకు రూ.1.23 కోట్లు, చిత్తూరు జిల్లాలో 297 గ్రామాల్లో 3355 పాడిరైతులకు రూ.62.93 లక్షలు, కడప జిల్లాలోని 161 గ్రామాల్లో 4,007 పాడి రైతులకు రూ.34.94 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 119 గ్రామాల్లో 2,103 పాడి రైతులకు రూ.35.44 లక్షలు, తిరుపతి జిల్లా 200 గ్రామాల్లో 2,287 పాడి రైతులకు రూ.20.36 లక్షలు, అనంతపురం జిల్లా 98 గ్రామాల్లో 1,009 పాడి రైతులకు రూ.9.79 లక్షలు బోనస్‌గా ఖాతాల్లో జమ చేశామన్నారు. రాష్ట్రంలోని ఇతర డెయిరీల కంటే అధిక ధరలను పాడిరైతులకు చెల్లించడమే కాకుండా నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ, వారు ఉత్పత్తి చేసే పాల నాణ్యతకు న్యాయమైన ధర చెల్లిస్తున్నామన్నారు. అమూల్ డెయిరీ సొంత పశుదాణా కర్మాగారంలో నాణ్యమైన పశుదాణా, మినరల్ మిక్చర్, లిక్విడ్ కాల్షియంలను తయారు చేసి లాభాపేక్ష లేకుండా రైతులకు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పాడిరైతులకు దసరా నవరాత్రుల సందర్భంగా అమూల్ డెయిరీ శుభాకాంక్షలు తెలుపుతోందన్నారు.

క్లుప్తంగా

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య


మృతి చెందిన సురేంద్ర

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ, వడ్డిపల్లికి చెందిన అవులకుంట సురేంద్ర (21) శుక్రవారం మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు. ఒంటరి జీవితం అనుభవించలేక గత కొన్నిరోజులుగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని హంద్రీనీవా ఉద్యోగికి తీవ్రగాయాలు


గాయపడిన రాజశేఖర్

మదనపల్లె : కారు ఢీకొని హంద్రీనీవా ఉద్యోగి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. బి.కొత్తకోట మండలం పెద్దపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు కే.రాజశేఖర్ ఎలక్ట్రీషియన్, లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని అంగళ్లు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని చెన్నామర్రిమిట్ట వద్ద ఎదురుగా వస్తున్న కారు మరో కారును ఓవర్‌టేక్ చేస్తూ రాజశేఖర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రాజశేఖర్ కాలువిరిగి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడ్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

శనగలు ఇచ్చేదెప్పుడు..
పంట సాగు చేసేదెప్పుడు..?



నా పేరు వెంకటరమణారెడ్డి. మాది రాజుపాలెం మండలం గాదెగూడూరు గ్రామం. నేను ఈ ఏడాది 20 ఎకరాల్లో శనగ పంట వేసుకునేందుకు ఎకరాలకు రూ. 4 వేలు పెట్టి 20 ఎకరాలకు 80 వేలు పెట్టుబడితో ఎరువులను విత్తుకున్నాను. విత్తనాలన కోసమని నాలుగు రోజుల క్రితం రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. అధికారులేమో విత్తనాల కోసం వెళితే రేపు మాపు అంటున్నారు. ఆలస్యమైతే పదును ఆరిపోతుంది. ఏం చేయాలో అర్థం కాలేదు.



నా పేరు గంగిరెడ్డి. మాది ఎర్రగుంట్ల మండలం మాలెపాడు గ్రామం. మూడు ఎకరాల్లో శనగ పంటను సాగుచేసుకునేందుకు రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుని 4 బ్యాగులకు రూ. 5640 డబ్బులు చెల్లించి రసీదు తీసుకున్నా. కానీ ఇంత వరకు విత్తనాలు ఇవ్వలేదు. పొలంలో పదును ఆరిపోతుంది. అధికారులేమో విత్తనాలు ఇవ్వలేదు. బయట తెచ్చుకుందామంటే ప్రభుత్వ ఇచ్చే విత్తనాలను ఏమి చేసుకోవాలి.

ఇలాంటి వేదన ఈ ఇద్దరు రైతులదే కాదు జిల్లావ్యాప్తంగా వేలమంది రైతులది. అధికారులేమో డబ్బులు చెల్లిస్తేనే విత్తనాలను చెప్పి డబ్బులు చెల్లించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రైతులేమో అప్పోసప్పో తెచ్చి ఆశపడి విత్తనాల కోసం డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు కట్టించుకుని విత్తనాలను సరఫరా చేయడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు చేతులెత్తేశారు. విత్తనాల సరఫరాలో ఆలస్యం అవుతుండటంతో పదును ఆరిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు వచ్చిన తరువాత విత్తుకుందామంటే మళ్లీ వర్షం కురుస్తుందో లేదో నన్న ఆందోళన కూడా రైతులను వేధిస్తోంది. ఇటు విత్తనాలు రాక అటు పదును ఆరిపోతుందేమోనన్న ఆందోళన మధ్య అన్నదాత నలిగిపోతున్నాడు.

- సకాలంలో విత్తనాలు సరఫరా చేయడంలో చేతులెత్తేసిన ప్రభుత్వం
- పదును ఆరిపోతుందని ఆందోళనలో అన్నదాతలు
- 72234 క్వింటాళ్లకుగాను ఇప్పటికే 3323.4 క్వింటాళ్లు మాత్రమే రాక
- రిజిస్ట్రేషన్స్‌తో సరి విత్తనాలు ఎప్పుడే మరి
- డబ్బులు కడితేనే విత్తనాలంటున్న అధికారులు
- రేపు మాపు అంటూ కాలం వెళ్లదీసున్న వ్యవసాయ అధికారులు



శనగ విత్తనసాగు కోసం ఎరువులను విత్తుకుంటున్న రైతులు (ఇన్‌సెట్) విత్తనాల కోసం రైతు నుంచి డబ్బులు కట్టించుకున్న రసీదు

కడప అగ్రికల్చర్ : ఖరీఫ్‌సీజన్‌లో సాగు చేసిన ఆరుతడి పంటలు వర్షాభావ పరిస్థితులతో దెబ్బతిని రైతులు నష్టాపోయారు. ముందస్తు రబీకి సంబంధించి శనగపంటను సాగు చేసుకుందామనుకుంటేనేమో రైతులకు విత్తనాలు అందక ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క రైతులు విత్తనాల కోసం వారి గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ముమ్మరంగా రిజిస్ట్రేషన్‌ను చేసుకుంటున్నారు. గత నెల చివరిలో జిల్లాలో మంచి వర్షాలు కురిశాయి. దీంతో పాటు ప్రస్తుతం కూడా జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. విత్తనం సిద్ధంగా ఉంటే ఈ పదునుకే చాలా మంది రైతులు శనగ విత్తనాన్ని విత్తుకునే వాళ్లు. కానీ ప్రభుత్వం మాత్రం రైతులకు సకాలంలో విత్తనాలను అందించడంలో చేతులెత్తేసింది. దీంతో అన్నదాతలు అందోళన చెందుతున్నారు.

రబీ సీజన్‌లో..

జిల్లాలో ప్రస్తుత రబీసీజన్‌లో శనగ విస్తారంగా సాగు కానుంది. ఈ ఏడాది సాగుకు ముందు వర్షాలు కూడా అనుకూలంగా మారటంతో శనగసాగుపై అన్నదాతలు కోటి ఆశలు పెట్టుకుని సాగుకు సన్నద్ధమతున్నారు. ఏటా జిల్లాలో అత్యధికంగా కమలాపురం, జమ్మలమడుగు, పొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గాల పరిధిలో అత్యధిక విస్తీర్ణంలో శనగపంట సాగవుతోంది. ఇప్పటికే ఆయా మండలాల్లో చాలా మంది రైతులు శనగ పంటసాగుకు ముందు ఎరువులను విత్తుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో ఆయా నిజయోకవర్గాల పరిధిలో ఈ ఏడాది 2,05,652 ఎకరాల్లో శనగ పంట సాధారణ సాగు కావాల్సి ఉంది. ఈ శనగసాగును అధికారులు దృష్టిలో ఉంచుకుని జిల్లాకు 72234 వేల క్వింటాళ్లు శనగ విత్తనాలను కేటాయించారు. ఇప్పటికి జిల్లాకు కేవలం 3323 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే వచ్చాయి.

బహిరంగ మార్కెట్‌లో..

జిల్లాలో చాలా మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తనాలను కొనుగోలు చేసుకునేందుకు సిద్ధమతున్నారు. కాకపోతే ఇప్పటికే చాలా మంది తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాలలో విత్తనాల కోసం డబ్బులు చెల్లించారు. పోనీ ఆ విత్తనాల కోసం ఎదురు చూడకుండా బయట కొనుగోలు చేసుకుందామంటే రైతు సేవా కేంద్రాలలో చెల్లించిన డబ్బులు వెనక్కు వస్తాయో రావోనన్న అందోళన. దీంతో పాటు ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే విత్తనాలకు బహిరంగ మార్కెట్‌లో దొరికే విత్తనాలకు రేటు కూడా పెద్ద తేడా లేదు. కొంతమంది రైతులు బయటనే కొనుగోలు చేసుకుంటున్నారు. ఏపీ సీడ్స్ నుంచి విత్తనాలు వచ్చేందుకు కొంత ఆలస్యమతుందని రైతులకు తెలియడంతో వ్యాపారులు బహిరంగ మార్కెట్ ధరలు పెంచి కిలో రూ.76 నుంచి 78 రుపాయల వరకు వసూలు చేస్తున్నట్లు పలువరు రైతులు తెలిపారు. ప్రభుత్వం మాత్రం కిలో రూ. 70.50 అందజేస్తుంది.

గతేడాది ఈ పాటికే విత్తనం పంపిణీ..

గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి శనగ విత్తనం పంపిణీ చేశారు. కానీ ఈ ఏడాది అక్టోబర్ 10వ తేదీ ఒక్క కమలాపురం మండలంలో మాత్రం అరకొరగా పంపిణీ చేశారు. తరువాత 11వ తేదీ సింహాద్రిపురం మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే పంపిణీ చేశారు. మిగతా జిల్లాలో ఎక్కడా పంపిణీ చేయలేదు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాలలో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్‌ను చేసుకుంటున్నారే తప్ప విత్తనాలను మాత్రం అందించలేదు. ఈ విషయమై ఏపీ సీడ్స్ మేనేజర్ జగదీష్‌ను వివరణ కోరగా రైతులు ఇప్పటి వరకు 8800 క్వింటాళ్లకు డబ్బులు చెల్లించారు. అందుకు సంబంధించి ఇప్పటికి 3323.4 క్వింటాళ్ల విత్తలను సరఫరా చేశాం. మిగతా డబ్బులకు సంబంధించిన విత్తనాలను మరో రెండు రోజుల్లో సరపరా చేస్తామని తెలిపారు.

తేదీల వారిగా జిల్లాకు వచ్చిన విత్తనాల వివరాలు ఇలా...

మండలం	ఆర్ఎస్‌కే	వచ్చిన విత్తనాలు క్వింటాళ్ల
4వ తేదీ వచ్చిన విత్తనాలు...		
కమలాపురం	చిన్నచెప్పలి	200
10వ తేదీ		
కమలాపురం	చిన్నచెప్పలి	200
కమలాపురం	కోగటం	200
కమలాపురం	కోగటం	200
కమలాపురం	ఎర్రగుడిపాడు	200
కొండాపురం	పొట్టిపాడు	187.2
కొండాపురం	లావనూరు	400
వేముల	గొల్లగూడూరు	150
11వ తేదీ		
సింహాద్రిపురం	అంకాలమ్మగూడురు	145
సింహాద్రిపురం	పైడిపాలెం	265.2
సింహాద్రిపురం	సుంకేసుల	150
సింహాద్రిపురం	హిమకుంట్ల	164.8
సింహాద్రిపురం	పైడిపాలెం	220
సింహాద్రిపురం	సుంకేసుల	170
సింహాద్రిపురం	సుంకేసుల	141.2
సింహాద్రిపురం	సింహాద్రిపురం -1	130
సింహాద్రిపురం	సింహాద్రిపురం-2	200

ఇప్పుడిస్తేనే ఉపయోగం...



రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగలు ఇప్పుడు ఇస్తేనే ఉపయోగం. ప్రస్తుతం భూమిలో పదును ఉంది. విత్తనాల విషయమై వ్యవసాయ అధికారులకు ఫోనేచేస్తే ఎప్పుడు ఇస్తారో ఇంకా తెలియదంటున్నారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో రైతులకు విత్తనాలను అందించాలి.

– సి సుబ్బారెడ్డి, చదిపిరాళ్ల గ్రామం. కమలాపురం

విత్తనాలు ఇవ్వకుంటే ఆందోళన చేస్తాం..



ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తనాలను రైతులకు సకాలంలో అందించకుంటే ఆందోళనలు చేస్తాం. పదును ఆరిపోయాక రైతులకు విత్తనాలను అందిస్తే ఎం లాభం. రైతుల వద్ద నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతోపాటు డబ్బులు కూడా కట్టించుకున్నారు. రైతులకు విత్తనాలు అందించడంలో అలసత్వం వహించరాదన్నారు.

– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి

స్కూటర్ నుంచి కిందపడి మహిళ మృతి

ఎర్రగుంట్ల : ఎట్టణ పరిధిలో వినాయకుడి విగ్రహాలు తయారీ కేంద్రం సమీపంలో స్కూటర్‌పై నుంచి కిందపడి ముద్దురెడ్డి దేవమ్మ (52) మృతి చెందింది. వివరాలిలా.. మైదుకూరు మండలం వెల్లిపల్లి కి చెందిన మునిరెడ్డి భార్య దేవమ్మ తన తమ్ముడు శివారెడ్డి నివాసం ఉండే చాపాడుకు వచ్చింది. అక్కడ నుంచి అక్క దేవమ్మను తమ్ముడు శివారెడ్డి స్కూటర్‌లో ఎక్కించుకోని చాపాడు నుంచి గండికి బయలుదేరాడు. ఎర్రగుంట్ల బైపాసు రోడ్డుకు రాగనే స్కూటర్‌పై నుంచి దేవమ్మ కింద పడింది. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి వృద్ధుడు..


మృతి చెందిన రెడ్డిఖాన్

వాల్మీకిపురం : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున వాల్మీపురం పట్టణంలో చోటు చేసుకొంది. వివరాలిలా.. కొత్తఇందిరమ్మ కాలనీకి చెందిన రెడ్డి ఖాన్ (72) తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి రెడ్డి ఖాన్ వ్యాపారం ముగించుకొని ఇంటికి తోపుడు బండితో వెళ్తుండగా ఇందిరమ్మ కాలనీ సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెడ్డిఖాన్ తీవ్రంగా గాయపడగా హుటాహుటిన స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి రెఫర్ చేయగా.. తిరిగి తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున రెడ్డిఖాన్ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన లక్ష్మమ్మ

మదనపల్లె : ఆటో ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి పుంగనూరు మండలంలో జరిగింది. ఈడిగపల్లెకు చెందిన జనార్ధన్ భార్య లక్ష్మమ్మ(55) భర్త చనిపోవడంతో కూలిపనులు చేసుకుంటూ జీవిస్తోంది. అలాగే కుమారుడు చనిపోవడంతో కోడలు వరలక్ష్మితో కలిసి ఉంటోంది. శుక్రవారం రాత్రి రోడ్డుపై ఉన్న మెడికల్ షాపులో మాత్రలు తీసుకునేందుకు వచ్చి రోడ్డు దాటుతుండగా పుంగనూరు నుంచి మదనపల్లెకు వస్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మమ్మ తలకు తీవ్రగాయం కాగా చేయి విరిగింది. అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చోరీ కేసులో అంతరాష్ట్ర నేరస్థుడు అరెస్ట్


నేరస్థుడు పుల్లానాయుడు

మదనపల్లె : చోరీ కేసులో అంతరాష్ట్ర నేరస్థుడిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. సెప్టెంబర్ 26వ తేదీ రాత్రి మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లెలో ఎస్.రెడ్డిమోహన్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడి 8 గ్రాముల బంగారు, రూ.17వేల నగదు చోరీ చేశాడు. ఈ కేసులో బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి శుక్రవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె సర్కిల్‌లో నిందితుడైన జే.పుల్లానాయుడు(33)ను అరెస్ట్‌చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 30 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతపురం రూరల్ మండలం మన్నీలా గ్రామానికి చెందిన లక్ష్మమ్మ కుమారుడు జే.పుల్లానాయుడు ప్రస్తుతం తిరుపతి తీర్థకట్టవీధిలో నివాసం ఉంటున్నాడన్నారు. చోరీలతో పాటు పలు నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మదనపల్లె వన్‌టౌన్ పరిధిలో వడ్డిపల్లె అమ్మవారి ఆలయంలో చోరీతో పాటు తాలూకా పరిధిలో చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడుగా ఉన్నారన్నారు. నిందితుడు కర్నూలు, ఆత్మకూరు, బళ్లారి, పొద్దుటూరు, మార్కాపురం, డోన్‌తో పాటు తెలంగాణలోని పలుచోట్ల నేరాలకు పాల్పడగా, 17 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

విశాఖ జట్టు విజయభేరి


సాయికృష్ణ చైతన్య, కడప, 129 పరుగుల


భానుస్వరూప్ విశాఖ, 5 వికెట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ పోటీల్లో విశాఖ జట్టు విజయం సాధించగా, మరో రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 44.3 ఓవర్లలో 113 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శ్రీవాత్సవ 51, సుదర్శన్ 26 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు భానుస్వరూప్ 5 వికెట్లు, వినోద్ 3 వికెట్లు తీశారు. దీంతో విశాఖ జట్టు ఇన్నింగ్స్, 119 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 63 పరుగులు చేయగా, విశాఖ జట్టు 295 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 159 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 6 వికెట్ల నష్టానికి 320 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని సాయికృష్ణ చైతన్య 129 పరుగులు, తాహీర్ 40 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్ తమన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. జట్టులోని కార్తీక్ 64, కృష్ణసాకేత్‌రెడ్డి 53 పరుగులు చేశారు. కడప బౌలర్లు హితేష్‌సాయి 3 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో తూర్పుగోదావరి జట్టు 151 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

చిత్తూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 70.4 ఓవర్లలో 165 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రాజమోహన్ 40, నీరజ్ 34 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు రక్షణ్‌సాయి 3, తేజేష్ 2, మునికేతన్ 2 వికెట్లు తీశారు. అనంతరం ఫాలోఆన్ రెండోఇన్నింగ్స్ ఆడిన ప్రకాశం జట్టు 27 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. జట్టులోని హేమంత్‌రాయల్ 42 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ దినేష్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 407 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు తగవు


రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం, మైనార్టీలు

రాయచోటి అర్బన్ : మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ముస్లిం, మైనార్టీలు డిమాండ్ చేశారు. మహమ్మద్ ప్రవక్తపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మైనార్టీలు జమాయత్ – ఉలేమా – ఏ హింద్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఠాణా వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వద్దకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి శాంతిని, సన్మార్గాన్ని బోధించే మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసి ముస్లింల మనోభావాలు దెబ్బతీయడం తగదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ముస్లిం, మైనార్టీలు పాల్గొన్నారు.

వైభవంగా గుండప్రవేశ మహోత్సవం


గుండప్రవేశ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


గుండప్రవేశం చేస్తున్న భక్తులు


వాసవీమాత ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

రాజంపేట టౌన్ : దసరా ఉత్సవాల్లో భాగంగా మహర్నవమిని పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారిశాల ముఖద్వారం వద్ద ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంథే నాగసత్యనారాయణగుప్త ఆధ్వర్యంలో గుండప్రవేశ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ప్రతిమను భక్తులు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పురోహితులు అమ్మవారి ప్రతిమకు విశేష పూజలు చేసి గుండప్రవేశం చేయించారు. గుండప్రవేశం చేసే సమయంలో భక్తులు జైమాత, జైజై మాత అంటూ పెద్దఎత్తున వాసవీనామస్మరణ చేశారు. గుండప్రవేశ మహోత్సవాన్ని తిలకించేందుకు పట్టణం నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు జన సంతోహంతో కనిపించాయి. డీఎస్పీ సుధాకర్ నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులుకలగకుండా ఉండేందుకు దాదాపు రెండు గంటల పాటు ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలను నిలిపివేసి, ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించేందుకు వీలుగా పోలీసులు చర్యలు చేపట్టారు. గుండప్రవేశ మహోత్సవం ప్రశాంత వాతావరణంలో ముగిసింది.